క్లుప్తంగా

ఏపీఓ మహాలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ఏపీవో మహాలక్ష్మి

పొదిలి రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం పొదిలి ఏపీఓగా వై. మహాలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఏపీవోగా పని చేసిన వెంకటరావు ముండ్లమూరు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానం కొండపిలో పని చేస్తున్న మహాలక్ష్మి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఈమె గతంలో ఇక్కడ ఏపీవోగా పని చేసిన అనుభవం కూడా ఉంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రతి పంచాయతీలో అడిగిన ప్రతి ఒక్కరికి పనికల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలీల చేత బాగా పని చేయించి కొలతల ప్రకారం ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు.

కోయల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న నాసరయ్య

మార్కాపురం: కోయల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య కోరారు. మంగళవారం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో కోయల సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం కోయలు ఇల్లులేక రోడ్లపైనే నివశించేవారని, ప్రస్తుతం కొంతమందికి గృహాలు వచ్చాయని, ప్రభుత్వం మిగిలినవారికి కూడా ఇల్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలని కోరారు. జూన్ 20న సీపీఐ జిల్లా మహాసభ దర్శిలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింహ, అల్లూరయ్య సిద్ధాంతి, పెద్దన్న, వెంకటయ్యతోపాటు ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కె ఖాశీం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో నూతనంగా వచ్చిన 3 బస్సులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అని అన్నారు. ఆర్టీసీలో ప్రయాణించడం వల్ల గమ్యాన్నికి క్షేమంగా చేరుతారనే నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా బడిబాట కార్యక్రమం



ఉపాధ్యాయుల నుంచి అడ్మిషన్ పొందుతున్న విద్యార్థులు

కొమరోలు: మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ముమ్మరంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్య, పలు రకాల పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలంటూ తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివరిస్తున్నారు.

జీజీహెచ్‌లో టీబీ స్క్రీనింగ్ పరీక్షలు



సీవై టీబీపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ మారుతీదేవీ, శ్రీనివాసరావు

మార్కాపురం: టీబీ నిర్ధారణకు వస్తున్న నూతన విధానాలపై సిబ్బంది అవగాహన కల్పించుకోవాలని జీజీహెచ్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ మారుతీదేవీ అన్నారు. స్థానిక జీజీహెచ్‌లో మంగళవారం సీవై-టీబీ క్షయవ్యాధి నిర్ధారణకు చర్మపరీక్షలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కృషిచేయాలన్నారు.ఆధునికంగా టీబీ వ్యాధిని నిర్ధారించే టెస్టును స్వయంగా ఆమె పరీక్షలు చేయించుకుని అనంతరం డెమో ద్వారా సిబ్బందికి చూపారు. జీజీహెచ్‌లో పనిచేసే 80 మందికిపైగా సిబ్బందికి సీవై-టీబీ స్క్రినింగ్ పరీక్షలు చేయించారు. టీబీ లక్షణాలు ఎవరికైనా ఉంటే వెంటనే మార్కాపురం టీబీ యూనిట్‌ను సంప్రదించాలని ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కె వీరాంజనేయనాయక్, సాయికిరణ్, రాధాకృష్ణ, ఆవులయ్య, చలపతి రావు, గోవిందరాజులు, పి. లక్ష్మిరెడ్డి, జెన్నీ వసుంధర, మంత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.



నిప్పులు కుమ్మరిస్తూ.. నేలకు దిగుతూ!

- సూర్యుడి భగభగలు
- విలవిల్లాడుతున్న ప్రజలు
- వారం రోజుల నుంచి పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మంగళవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మార్కాపురం: వేసవిలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మే నెల రాక ముందే నిప్పులు కక్కుతూ నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఎండల ధాటికి తట్టుకోలేక ప్రజలు భయకంపితులవుతున్నారు. సూర్యుడి ఎండవేడికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మార్కాపురం ప్రాంతం నిప్పుల కుంపటిగా మారింది. గత వారం రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం రోజు మార్కాపురం పట్టణంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాయంత్రం పూట వాతావరణం చల్లబడుతున్నప్పటికీ 5 గంటల వరకూ తీవ్రమైన ఎండ వేడికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. రోజుకు 40–43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, తదితర ప్రాంతాల్లో ఎండ తీవ్రతకు వృద్ధులు, పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిప్పుల గుండంగా మారటంతో మార్కాపురంలోని ప్రధాన రహదారులన్నీ 11 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్కాపురంలో ప్రధాన వీధులైన నెహ్రూ బజార్, మెయిన్ బజార్, పాతబస్టాండ్, కోర్టు సెంటర్, కంభం సెంటర్, నాయుడువీధి, దోర్నాల సెంటర్ వీధులన్నీ 11 గంటల తరువాత జన సంచారం లేకుండా కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు.



మార్కాపురంలో నిర్మానుష్యంగా ఉన్న పాతబస్టాండ్

భయపడుతున్న జనం..

మార్కాపురం ప్రాంతంలో పలకల గనులు ఎక్కువగా ఉండటంతో ఎండ తీవ్రత కూడ ఎక్కువగా ఉంది. వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉండటంతో ఉదయం 10 గంటలకు 38 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుండగా, మధ్యాహ్నం 2 గంటల సమయంకు 40 నుంచి 43 డిగ్రీలకు చేరుతుంది. రోడ్డుపై నిప్పుల సెగ వ్యాపించటంతో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉద్యోగులు మాత్రం తప్పని సరిగా ఆఫీసులకు వెళ్లాల్సి వస్తుంది. దీనితో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావటం లేదు. గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు తగ్గిపోయాయి. సాయంత్రం 5 గంటలు దాటిన తరువాతే వస్తున్నారు. సోమవారం మార్కాపురంలో లక్ష్మి చెన్నకేశవస్వామి రథోత్సవానికి కూడా భక్తులు ప్రజలు 5 గంటలు దాటిన తరువాతనే స్వామివారిని చూసేందుకు బయటకు వచ్చారు.

ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	వారం	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
22.04.2025	మంగళవారం	43
21.04.2025	సోమవారం	40
20.04.2025	ఆదివారం	39
19.04.2025	శనివారం	40
18.04.2025	శుక్రవారం	39
17.04.2025	గురువారం	38

ఎండలకు వ్యాపారాలు లేవు..



గత వారం రోజుల నుంచి మార్కాపురం ప్రాంతంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలెవరూ బయటకు రావడంలేదు. దీనితో వ్యాపారాలు కూడా తగ్గిపోయాయి. మధ్యాహ్నం 11.30 గంటలు దాటితే ఇళ్లలోనుంచి ఎవరూ బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితేనే ప్రజలు బయటకు వస్తున్నారు. దీనితో వ్యాపారాలు లేక, అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. ఏప్రిల్ నెలాఖరులోనే ఇలా ఉంటే రానున్న మే నెలలో ఎండల తీవ్రత ఎలా ఉంటోయో మరి.

– శ్రీనివాసులు, వాచ్‌షాప్, మార్కాపురం

ఎండలకు జాగ్రత్తలు తీసుకోవాలి..



ఈ సంవత్సరం ఎండల తీవ్ర ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వృద్ధులు, పిల్లలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వడ దెబ్బకు గురైతే ప్రాణాపాయ పరిస్థితిగా మారవచ్చు. ఉదయం 11 గంటలు దాటితే బయటకు రాకుండా ఉంటేనే మంచిది. సాయంత్రం 6 తరువాత చల్లబడిన తరువాత బయట పనులు చూసుకోండి. తరచుగా నీరు, మజ్జిగ తీసుకోవాలి. వడదెబ్బ సోకినట్లు అనిపిస్తే వెంటనే వైద్యుల సలహా పాటించాలి.

– డాక్టర్ సాయికిరణ్, జీజీహెచ్ మార్కాపురం

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: రోడ్డు విస్తరణ పనులు ప్రజలకు నరకం చూపుతున్నాయి. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు-నంద్యాల హైవేరోడ్డు వరకు విస్తరణ పనులు ప్రారంభించి నాలుగు నెలలు అవుతోంది. రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయి. కనీసం గృహాల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండపోయింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 19న సాక్షిలో ×అధికారులకు పట్టాదా..? । అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. ఒక నెల డస్ట్ దొరకడం లేదని, రెండు నెలలు బిల్లులు రావడం లేదని, మరికొన్ని రోజులు వర్షాలు.. ఇప్పుడు సిమెంట్ రేట్ పెరిగిందని సాకులు చెప్తూ వచ్చారు. రోడ్డు నిర్మాణం నత్త కన్నా దారుణంగా ముందుకు సాగుతోంది. ఎట్టకేలకు పనులు ప్రారంభించడంతో వాహనదారులు, గృహస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు వైపులా సకాలంలో పనులు పూర్తి చేయించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అధికారులకు పట్టదా..?

సాక్షిలో ప్రచురితమైన కథనం

వృథాగా పోతున్న సాగర్ నీరు

- పట్టించుకోని అధికారులు



కొనకనమిట్ల ఎస్సీ కాలనీ వద్ద సాగర్ వాల్ నుంచి పోతున్న నీరు

కొనకనమిట్ల: అసలే కొన్ని గ్రామాల్లో ప్రజలు మంచినీటి కోసం నానా ఇబ్బందులు పడుతుంటే మరోపక్క అధికారుల నిర్లక్ష్యం కారణంగా గొంతెండిపోయే పరిస్థితి రానునుంది. గ్రామాలకు సాగర్ నీరు సరఫరా అవుతున్నప్పటికి కొన్నిచోట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం వలన సాగర్ నీరు వృథా అవుతోంది. గతంలో చందవరం సమ్మర్ స్టోరేజ్ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు సాగర్ నీరు అందించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, మినీ ట్యాంక్‌లను నిర్మించి పైప్‌ల ద్వారా గ్రామాల్లో సరఫరా చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా పర్యవేక్షణ లోపంతో కొన్ని చోట్ల పైపులు లీకై నీరు నేలపావుతున్నాయి. గ్రామాలకు నీటి సరఫరా చేసే సమయంలో చౌటపల్లి బస్టాండ్, కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్, ఎస్సీ కాలనీ సమీపంలో కులాయిల నుంచి నీరు వృథాగా పోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గొట్లగట్టులో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు.అయితే ఇటీవల కొన్ని రోజులుగా సాగర్ నీరు సరఫరా సమయంలో గొట్లగట్టు ప్రధాన వీధిలో పైప్ లీకై నీరు బజారున పారుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వీడి వృథా అవుతున్న సాగర్ జలాల లీకేజీలకు మరమ్మతులు చేపట్టి, లీకేజీలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన



విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను చూపుతున్న తల్లిదండ్రులు, హెచ్‌ఎం



నాగంపల్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

తర్లుపాడు: బంగారు భవిత కోసం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మాలాలి కోరారు. మంగళవారం హెచ్‌ఎం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ప్రోగ్రెస్ కార్డులను తలిదండ్రులకు హెచ్‌ఎం అవగాహన కల్పించారు. తల్లిలాంటి ప్రేమ, తండ్రి లాంటి బాధ్యత తీసుకొని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: బడిఈడు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ-2 బరిగె నరసింహరావు అన్నారు. మండలంలోని నాయుడుపేట, నాగంపల్లి గ్రామాల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మోడల్ ప్రైమరి పాఠశాలల ఏర్పాటు, 5 తరగతులకు ఐదుగురు టీచర్ల నియామకం, విద్యార్థులకు కలిగే ఉపయోగాలను తల్లిదండ్రులకు, గ్రామ ప్రజలకు అవగాహన కలిపించారు. నాగంపల్లిలో ప్రతిపాదిత ఉన్నత పాఠశాల గురించి తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జీవీ నాయక్, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌తో ఉపయోగాలు

కొమరోలు: మనమిత్ర పేరుతో వాట్సప్ గవర్నెన్స్ నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని.. దీనిని ప్రతి ఒక్కరూ పలు రకాల ప్రభుత్వ సేవల కోసం ఉపయోగించుకోవచ్చని ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. మండలంలోని అల్లినగరం, తిమ్మారెడ్డిపల్లె గ్రామాల్లో మనమిత్ర సర్వే అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి ప్రజల వద్దకు వెళ్లి మనమిత్రపై అవగాహన కల్పించారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో సేవలను కార్యాలయాల వద్దకు వెళ్లకుండా ఇంటి వద్ద నుంచే ఉపయోగించుకోవచ్చని తెలిపారు.



మనమిత్రపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మస్తాన్‌వలి

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి



విద్యార్థులకు బహుమతులందిస్తున్న దాతలు

కంభం: పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం కీలకమని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక నాయక్ వీధిలోని ఉర్దూ పాఠశాల వార్షికోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలు బాషా, మై జీవన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాజీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, పూర్వపు చైర్మన్ రుక్సాన, ఖాసింపీరా ను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. దాతలు మాట్లాడుతూ నిరంతరం పాఠశాల పురోభివృద్ధికి హెచ్‌ఎం సాహెరా బేగం ఎనలేని కృషి చేశారన్నారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాజీద్ బాషా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది చిన్నిపద్మావతి, మురళి, బాబురావు, శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలు కలిసికట్టుగా పనిచేయాలి

మార్కాపురం టౌన్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నేతలు కలిసికట్టుగా ఉండి పోటీచేద్దామని నియోజకవర్గ ఆపార్టీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు అన్నారు. బీజేపీ కార్యకర్తల సమావేశం మంగళవారం పట్టణంలోని దోర్నాల బస్టాండ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగింది. గ్రామస్థాయి, బూత్ స్థాయిల్లో పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోనికి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్ సరోజినీ, బి కృష్ణ, షేక్ షబాభా, డి చంద్రశేఖర్, ఆంజనేయులు, చిన్నయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పదహారు రోజుల పండగ



ఏకాంతసేవ కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: అంతా రామమయం.. జగమంతా రామమయం అంటూ మండలంలోని గొట్లగట్టు సీతారామస్వామి ఆలయంలో 16 రోజుల పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా జరగగా, కల్యాణం అనంతరం జరిగే 16 రోజుల వేడుకలను భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమాన్ని పొదిలి భవాని ఫర్టిలైజర్స్ (పేర్ల) ఆధ్వర్యంలో నిర్వహించారు. చూసిన కనులదే భాగ్యం అన్నట్లు అలంకరించిన సీతారాముల వారికి ఏకాంత సేవ, పాన్పు ఉత్సవం జరిపించారు. తొలుత భక్తి గీతాలతో ఏర్పాటు చేసిన భజనా కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.



ఏకాంత సేవలో భక్తులు

పాఠశాలల బలోపేతంలో ఉపాధ్యాయులే కీలకం



డిప్యూటీ డీఈఓలను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

మార్కాపురం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని మార్కాపురం, ఒంగోలు డిప్యూటీ డీఈఓలు బీ శామ్యూల్ జాన్, చంద్రమౌళీశ్వర్ సూచించారు. మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంల సమావేశంలో వారు మాట్లాడారు. హెచ్‌ఎంలు తమ పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది పూర్వ విద్యార్థుల సహకారంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల నమోదు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఈసందర్భంగా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న విద్యాశాఖాధికారులు శామ్యూల్ జాన్, చంద్రమౌళీశ్వర్‌లతో పాటు హెచ్‌ఎంలు కాశయ్య, తిరుపతిరెడ్డి, గురుస్వామి, సుబ్రమణ్యం, వరలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.